అక్షర దర్బార్
www.aksharadarbar.com
voice of the people
వెల ₹5
బుధవారం 16, ఏప్రిల్ 2025 | సంపుటి :02 | సంచిక :58 | పేజీలు :04

## జల్సాల కోసం బైక్ చోరీలు

- నిందితుడి అరెస్టు
- 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

5లో..



## స్మితా సబర్వాల్‌కు షాక్



- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో పోలీసుల నోటీసులు
- విచారణకు హాజరుపై ఉత్కంఠ

3లో..

# పగలు డంపింగ్ రాత్రి షిఫ్టింగ్

- ఇసుకాసురుల ఇష్టారాజ్యం
- భూపాలపల్లి నియోజకవర్గంలో యథేచ్ఛగా తవ్వకాలు
- మొగుళ్లపల్లి, పోతుగల్, వేములపల్లి వాగును చెరబట్టిన కేటుగాళ్లు

2లో..

ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ కొందరు వ్యాపారులు చెలరేగిపోతున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని పోతుగల్, వేములపల్లి, మొగుళ్లపల్లి శివారు వాగు నుంచి నిత్యం ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని దృష్టిలో పెట్టుకొని లబ్దిదారులకు ఆర్థికభారం తగ్గించాలనే సదుద్దేశంతో స్థానిక అవసరాల కోసం వాగులో నుంచి ఇసుకను తీసుకెళ్లనివ్వండి అంటూ ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అధికారులను ఆదేశించగా.. ఇదే అదునుగా భావించిన కొందరు కేటుగాళ్లు అక్రమాలకు తెరలేపారు. పక్కనున్న హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి కొందరు లీజ్‌కు తెచ్చుకోగా, మరికొందరు ట్రాక్టర్లు కొనుగోలు చేసి మరీ ఈ దందా కొనసాగిస్తున్నారు. రోజుకు సుమారు 50 ట్రాక్టర్లతో ఇండ్లు, బంధువులు, మిత్రుల భూముల వద్ద పగలు డంప్ చేస్తున్నారు. రాత్రి వేళలో నియోజకవర్గం, జిల్లా దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, కొద్ది రోజుల కింద పలు ఇసుక డంప్‌లపై రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడులు చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. అయితే.. డంప్‌లు మాయమవడమేగాక, కేసులు కూడా లేకపోవడం గమనార్హం. ఇక అప్పటి నుంచి దాడులు కూడా నిలిచిపోవడంతో ఇసుక మాఫియా మరింత చెలరేగిపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- అక్షరదర్బార్, మొగుళ్లపల్లి



- ఓ ముఖ్య ప్రజాప్రతినిధి సూచనలు దుర్వినియోగం
- ట్రాక్టర్లు లీజ్ తీసుకోవడంతోపాటు కొనుగోలు చేసి దందా..
- గతంలో అక్రమంగా నిల్వచేసిన డంప్‌లను పట్టుకున్న అధికారులు
- కొద్ది రోజులకు మాయమైన ఇసుక.. కేసులు కూడా లేవ్..

## రెండు వారాల్లో అర్హుల జాబితా

- పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక
- అనర్హులకు ఇచ్చి ఇబ్బందులు తెచ్చుకోవద్దు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

5లో..



## వడగండ్ల నష్టం

- నేల వాలిన వరి, మిరప, మొక్కజొన్న పంటలు
- కల్లాల్లో ఆరబోసిన మిర్చి, ధాన్యం వరద పాలు
- బోరుమన్న రంగాపురం, ఇస్సీపేట తదితర గ్రామాల రైతులు

5లో..

ఈ ఏడాది రైతుల పరిస్థితి కడు దయనీయంగా తయారైంది. ఇప్పటికే పంటలకు సాగునీరు అందక, పంట ఉత్పత్తులకు మార్కెట్ లో గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా అకాల వర్షం కురిసింది. మంగళవారం రాత్రి వడగండ్ల వానతో భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి, మిరప, మొక్కజొన్న పంటలు నేల వాలాయి. మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం, ఇస్సీపేట, మొగుళ్లపల్లి తదితర గ్రామాల్లో కొన్ని గంటలపాటు వడగండ్ల వాన పడటం వల్ల వరి పంటలోని గింజలు, మిరప చేనులోని కాయలు కింద రాలిపోయాయి. కల్లాల్లో రైతులు ఆరబోసిన మిర్చి, వడ్లు వరదకు కొట్టుకుపోయాయి. బుధవారం ఉదయం రైతులు వరద నీటిలో తేలాడిన మిర్చి, వడ్లను కుప్పగా చేసి ఆరబోశారు. నేలరాలిన పంటలను చూసి సదరు గ్రామాల బాధిత రైతులు బోరుమన్నారు. అకాల వర్షం వల్ల వంట నష్టపోయిన తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నష్టం జరిగిన పంటలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి పరిహారాన్ని అందజేయాలని వేడుకుంటున్నారు. -అక్షరదర్బార్, మొగుళ్లపల్లి



బుధవారం
16.04.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people

# పగలు డంపింగ్ రాత్రి షిఫ్టింగ్

## ఇసుకాసురుల ఇష్టారాజ్యం



- భూపాలపల్లి నియోజకవర్గంలో యథేచ్ఛగా తవ్వకాలు
- మొగుళ్లపల్లి, పోతుగల్, వేములపల్లి వాగును చెరబట్టిన కేటుగాళ్లు
- ఓ ముఖ్య ప్రజాప్రతినిధి సూచనలు దుర్వినియోగం
- ట్రాక్టర్లు లీజ్ తీసుకోవడంతోపాటు కొనుగోలు చేసి దందా..
- గతంలో అక్రమంగా నిల్వచేసిన డంప్‌లను పట్టుకున్న అధికారులు
- కొద్ది రోజులకు మాయమైన ఇసుక.. కేసులు కూడా లేవ్..

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి: ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ కొందరు వ్యాపారులు చెలరేగిపోతున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని పోతుగల్, వేములపల్లి, మొగుళ్లపల్లి శివారు వాగు నుంచి నిత్యం ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని దృష్టిలో పెట్టుకొని లబ్ధిదారులకు ఆర్థికభారం తగ్గించాలనే సదుద్దేశంతో స్థానిక అవసరాల కోసం వాగులో నుంచి ఇసుకను తీసుకెళ్లనివ్వండి అంటూ ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అధికారులను ఆదేశించగా.. ఇదే అదునుగా భావించిన కొందరు కేటుగాళ్లు అక్రమాలకు తెరలేపారు. పక్కనున్న హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి కొందరు లీజ్‌కు తెచ్చుకోగా, మరికొందరు ట్రాక్టర్లు కొనుగోలు చేసి మరీ ఈ దందా కొనసాగిస్తున్నారు. రోజుకు సుమారు 50 ట్రాక్టర్లతో ఇండ్లు, బంధువులు, మిత్రుల భూముల వద్ద పగలు డంప్ చేస్తున్నారు. రాత్రి వేళలో నియోజకవర్గం, జిల్లా దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, కొద్ది రోజుల కింద పలు ఇసుక డంప్‌లపై రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడులు చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. అయితే.. డంప్‌లు మాయమవడమేగాక, కేసులు కూడా లేకపోవడం గమనార్హం. ఇక అప్పటి నుంచి దాడులు కూడా నిలిచిపోవడంతో ఇసుక మాఫియా మరింత చెలరేగిపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**దందా కోసం ట్రాక్టర్లు లీజ్.. భూములు కొనుగోలు**

ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని దృష్టిలో పెట్టుకొని లబ్ధిదారులకు ఆర్థికభారం తగ్గించేందుకు స్థానిక అవసరాల కోసం వాగులో నుంచి ఇసుకను తీసుకెళ్తే అడ్డుకోవద్దు అంటూ భూపాలపల్లి నియోజకవర్గంలోని ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అధికారులను ఆదేశించారు. అయితే ఇదే అదునుగా భావించిన కొందరు పెద్దఎత్తున అక్రమాలకు తెరలేపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు తీసుకెళ్లాలని, స్థానిక అవసరాలకు మాత్రమే ఉపయోగపడాలని స్పష్టం చేసినప్పటికీ సదరు ప్రజాప్రతినిధి సూచనలను దుర్వినియోగం చేస్తూ వ్యాపారం మొదలుపెట్టారు. భూపాలపల్లి జిల్లా సరిహద్దు మొగుళ్లపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని పోతుగల్,



వేములపల్లి శివారు వాగు నుంచి ట్రాక్టర్లతో పెద్దఎత్తున ఇసుకను తరలిస్తూ నియోజకవర్గ సరిహద్దు గ్రామాల్లో తెలిసిన వారి భూములు, జాగల వద్ద డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రి వేళ సరిహద్దులు దాటిస్తున్నారు. పక్కనున్న హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు ట్రాక్టర్లు కొన్ని ఖాళీగా ఉండటంతో కొందరు లీజ్‌కు తెచ్చుకోగా, మరికొందరు ఈ దందా కోసం ఏకంగా ట్రాక్టర్లతోపాటు ఇసుక డంప్ చేసేందుకు భూములు సైతం కొనుగోలు చేసినట్లు సమాచారం.

**సరి (హద్దు)లు దాటుతూ..**

పోతుగల్ వాగు నుంచి ఇసుక ట్రాక్టర్లను కోమటిపల్లి, బర్లపల్లి, ఆకినపల్లి మీదుగా కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట, జమ్మి కుంటకు తరలిస్తున్నారు. వయా మొగుళ్లపల్లి మీదుగా హన్మకొండ జిల్లాకు చేరుస్తున్నారు. హన్మకొండ జిల్లా సరిహద్దులో గల వేములపల్లి వాగు నుంచి వరికోల్ మీదుగా పరకాల, నడికూడ, కమలాపూర్ మూడు మండలాలకు ఇసుకను తరలిస్తున్నారు. హన్మకొండ జిల్లాలోని హసన్‌పర్తికి కూడా తరలిస్తున్నట్లు సమాచారం. మొగుళ్లపల్లి మండలకేంద్రం శివారు వాగు నుంచి వయా రంగాపురం మీదుగా శాయంపేట పేరు చెప్పి హన్మకొండ, పరకాలకు తరలిస్తున్నట్లు సమాచారం. దొడ్డు ఇసుక ట్రాక్టర్‌కు రూ. 4, 500, సన్న ఇసుకకు రూ. 5, 500 లు వసూల్ చేస్తున్నారు.

**కేసులు లేవు.. ఇసుక లేదు..**

అక్రమ ఇసుక డంప్‌లపై 2 నెలల కింద కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట పోలీసులు కేసులు నమోదు చేశారు. మొగుళ్లపల్లి మండలం ఇప్పలపల్లిలో కొద్ది నెలల కింద 13 ట్రిప్పుల ఇసుక డంప్‌ను పట్టుకొని గ్రామ పంచాయతీ కార్యదర్శికి రెవెన్యూ అధికారులు అప్పగించారు. కొద్ది రోజులకు ఎలాంటి కేసులు లేకపోగా ఇసుకకూడా మాయమైంది. బద్దంపల్లి గ్రామంలో ఇసుక డంప్‌ను పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి పట్టుకొని గ్రామ పంచాయతీ కార్యదర్శికి అప్పగించారు. ఇక్కడ ఇసుక డంప్ మాయమవడమేగాక ఎలాంటి కేసులూ నమోదు కాలేదు. ఇక మొగుళ్లపల్లి మండలం ఇస్సిపేట గ్రామంలో ఇసుక వ్యాపారం చేస్తున్న వ్యక్తి ఇంటి వద్ద కూడా రెవెన్యూ అధికారులు ఇసుక డంప్‌ను పట్టుకోగా.. ఇక్కడ కూడా ఇసుక మాయమవడం గమనార్హం. ఇక అప్పటి నుంచి దాడులులేకపోవడంతో ఇసుక మాఫియా మరింతగా పెరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు అగ్రనేతలు మృతి
- హల్దార్, రమేగా గుర్తించిన పోలీసులు
- వారి తలలపై రూ.8 లక్షలు, రూ.5 లక్షల రివార్డు

అక్షరదర్బార్, వరంగల్: దండకారణ్యం మరోమారు కాల్పుల మోతతో దద్దరిల్లింది. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మావోయిస్టు అగ్రనేతలు ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొండగావ్–నారాయణ్‌పూర్ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో మంగళవారం సాయంత్రం కొండగావ్‌కు చెందిన రిజర్వ్ గార్డ్, పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే ఎదురు కాల్పులు జరిగినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో రెండు మృతదేహాలు, ఏకే–47 తుపాకీని బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతులు మావోయిస్టుల కమాండర్, తూర్పు బస్తర్ డివిజన్ సభ్యుడు హల్దార్, ఏరియా కమిటీ సభ్యుడు రమేగా గుర్తించినట్లు చెప్పారు. హల్దార్, రమే తలలపై రూ.8 లక్షలు, రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు.

# 80 శాతం పనులు పూర్తి

- మిగతా పనులు పది రోజుల్లో కంప్లీట్
- హన్మకొండ కలెక్టర్ ప్రావీణ్య
- ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులు పరిశీలన

అక్షరదర్బార్, హనుమకొండ: ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులను త్వరగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో కుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న జంక్షన్ అభివృద్ధి, సుందరీకరణ పనులు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి గురించి కుడా పీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జంక్షన్ నిర్మాణానికి సంబంధించిన మ్యాపును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జంక్షన్ నిర్మాణం, సుందరీకరణ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయని, మిగతా పనులను పది రోజుల్లో పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫౌంటెన్ నిర్మాణం, గ్రీనరీ ఏర్పాటు, శిల్పాలు, విద్యుత్ లైట్లు, హై మాస్ట్ లైట్లు, సైన్ బోర్డులు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. బస్టాండ్ ప్రాంగణం, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్ పరిశీలించారు.

# బధిరుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

**ఉచిత బోధన, హాస్టల్ సౌకర్యం**

**హెచ్ ఎం లక్ష్మీనరసమ్మ**

అక్షరదర్బార్, హన్మకొండ: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హనుమకొండలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర బధిరుల పాఠశాలలో 2025–26 సంవత్సరానికిగాను ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు జే. లక్ష్మీనరసమ్మ తెలిపారు. ఈనెల 12 నుంచి జూన్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు, సదరం సర్టిఫికెట్, ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. ప్రవేశం పొందిన వారికి ఉచితంగా హాస్టల్ వసతి, 1 నుంచి 10వ తరగతి వరకు ఉచితంగా బోధన ఉంటుందని తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9440739423, 9866673486 నెంబర్లలో సంప్రదించాలని హెచ్‌ఎం సూచించారు.

అక్షర దర్బార్ voice of the people
బుధవారం
16.04.2025
www.aksharadarbar.com


# బీజేపీ అంటేనే ఈడీ మోడీ

- కాంగ్రెస్ బలం పెరుగుతుందనే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై ఈడీ వేధింపులు
- మంత్రి పొన్నం ప్రభాకర్



అక్షర దర్బార్, భీమదేవరపల్లి : బీజేపీ అంటేనే ఈడి,మోడీ ,ఐటీ దాడులు గా పని చేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా చేపల వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. సన్న వడ్లకు ఈసారి 500 బోనస్ ఇస్తున్నామన్నారు. ధాన్యాన్ని బయట అమ్ము కోకుండా కొనుగోలు కేంద్రాల్లో దాన్యాన్ని అమ్మా లని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించింది అని సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయన్నారు. అర్హులకు మాత్రమే ఇల్లు వస్తాయి ఇందులో రాజకీయ ప్రమేయం ఉండదని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ పూర్తి చేశాం. త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యోగాల నియామకాలు చేపడుతున్నామని అన్నారు. కుల గణన పూర్తి చేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచామని తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. గౌరవెల్లి కాలువలు పూర్తి చేసి నీరు అందిస్తామని తెలియజేశారు. వంగరకు బండి సంజయ్ సహకారంతో నవోదయ పాఠశాల తీసుకొస్తున్నామన్నారు. ఎన్నికల తరువాత కాంగ్రెస్ బలం పెరుగుతుండటం, ప్రజల కోసం అనేక ఉద్యమాలు కార్యక్రమాలు చేస్తుండడంతో బీజేపీ మీద వ్యతిరేకత జరుగుతున్న సందర్భంలో మా అధినాయకత్వం అయిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లను నేషనల్ హెరాల్డ్ లో ఈడి పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారు. నేషనల్ హెరాల్డ్ పై ఏమైనా ఉంటే చర్యలు తీసుకోవచ్చు. కానీ వేధింపుల కొరకు మాత్రమే ఉపయోగించుకొని హెర్నెంట్ కోసమే ప్రభుత్వ విధానం నడుస్తుంది. నరేంద్ర మోదీ కి ఇది మంచిది కాదు. పార్లమెంట్ లో రాహుల్ గాంధీకి జవాబు చెప్పలేక దేశ వ్యాప్తంగా బీజేపీ వైఫల్యాల పట్ల కాంగ్రెస్ పోరాటాలు చేస్తుంది. మా పార్టీ ఇంకా రెట్టింపు ఉత్సాహంతో బీజేపీ వైఫల్యాల ప్రజా వ్యతిరేకత పై మా పోరాటాలు కొనసాగిస్తాం. సోనియా గాంధీ రాహుల్ గాంధీ వెంట దేశం మొత్తం ఉంది. ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబాన్ని వేధిస్తే మంచిది కాదు అన్నారు. అంబేద్కర్ కి దండ వేసి నివాళులు అర్పించని పార్టీ ప్రముఖులు అంబేద్కర్ దగ్గరకు వస్తే రాజకీయం చేస్తే అంబేద్కర్ మీద ప్రేమ ఎంత ఉందో తెలుసు. అంబేద్కరిజం కి వారసులు కాంగ్రెస్ పార్టీ. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం రక్షించేది కాంగ్రెస్ పార్టీ. మేము రాజ్యాంగ రక్షణ కోసం మాట్లాడుతుంటే ఓర్వలేక మాట్లాడుతున్నారు అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి టు కిషన్ రావు పల్లి రహదారి పనులు ప్రారంభించాలి

అక్షర దర్బార్, మల్హర్ : మండలంలోని కిషన్ రావుపల్లి నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రం వరకు అటవీ నుంచి రోడ్డు పనులు ప్రారంభించాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ మండల అధ్యక్షుడు మంత్రి రాజబాబు ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు, రోడ్డు నిర్మాణ పనులు కోసం ప్రత్యేక జీవో, ఫారెస్ట్ అధికారులకు చెల్లించాల్సిన రూ.4 కోట్ల పైన సొమ్ము ,నిర్మాణ పనులు కోసం రూ.33 కోట్ల,70 లక్షల నిధులు సైతం మంజూరైన రోడ్డు ప్రారంభించడంలో ఆలస్యం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్డు పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## కాపురంపల్లిలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన..!

### హాజరైన ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి

అక్షర, దర్బార్ మల్హర్ : మండలంలోని తాడిచెర్ల గ్రామ పరిధిలోని కాపురంపల్లిలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గత నాలుగు రోజులు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ కార్యక్రమానికి ఓసీపీ బ్లాక్-1లో బొగ్గు తవ్వకాలు చేపట్టిన ఏఎమ్మార్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, మైన్ సీనియర్ మేనేజర్ కెఎస్ఎన్ మూర్తి హాజరయ్యారు. ప్రతిష్ఠాపన ఉత్సవాలు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ బొడ్రాయిని ప్రతిష్ఠించారు. బొడ్రాయి అగ్ని ప్రతిష్ఠాపన, చండీహోమం, బొడ్రాయి ఊరేగింపు, అభిషేకం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న పెద్ద, చిన్నఅందరూ మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని ప్రభాకర్ రెడ్డి ఆకాంక్షించారు.



## 'చర్లపెల్లి'ని పరామర్శించిన నేతలు



అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి: ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జయశంకర్ భూపాల పల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై చికిత్స పొందు తున్నారు. ఈ క్రమంలో పలువురు రాజకీయ నాయకులతోపాటు జర్నలిస్టులు చర్లపల్లి వెంకటేశ్వర గౌడ్ ను కలిసి పరామర్శించారు. ఆయన్ను పరామర్శించిన వారిలో మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ బత్తిని శ్రీహరి, పోతుగల్ మాజీ సర్పంచ్ వీరన్న, సీనియర్ జర్నలిస్టు రాళ్లబండి శ్రీనివాస్, ఆర్టీఐ సభ్యుడు కిరణ్, రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిమ్మల భద్రయ్య, వేములపల్లి వ్యవసాయ అసిస్టెంట్ అధికారి నూతన ప్రసాద్, ఆర్టీఐ సభ్యుడు బండార్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## రెడ్ క్రాస్' చలివేంద్రం ప్రారంభం

అక్షరదర్బార్, హనుమకొండ: మండుటెండల్లో ప్రజలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ బుధవారం రెడ్ క్రాస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎ వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా రెడ్ క్రాస్ మినరల్ వాటర్ ప్లాంట్, తలసీమియా కేంద్రాన్ని సందర్శించి, చికిత్స పొందుతున్న చిన్నారులతో ముచ్చటించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తలసీమియా బాధితుల కోసం రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిని రెడ్ క్రాస్ సభ్యులు పూల మొక్కను బహూకరించి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డా పి విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మి నేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు డా ఎం శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా కె సుధాకర్ రెడ్డి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణ రెడ్డి, రెడ్ క్రాస్ వైద్యులు డా జె కిషన్ రావు తదితరులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



## కొండాను కలిసిన ఐజేయూ నేతలు

### జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వినతి

అక్షరదర్బార్, వరంగల్: ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ సహకారంతో తెలంగాణ రాష్ట్ర యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ కమిటి వరంగల్ జిల్లా శాఖ ఎన్నికల్లో నూతనంగా గెలిచిన కార్యవర్గ సభ్యులు అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్ ఆధ్వర్యంలో జనరల్ సెక్రటరీ మట్టా దుర్గా ప్రసాద్ కోఆర్డి నేషన్ లో గురువారం వరంగల్ ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కార్యవర్గ సభ్యులు ఆయనకు బోకే ఇచ్చి అభినందనలు స్వీకరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి మాజీ ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి కొండా సురేఖ సహకారంతో పరిష్కరించాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్, జనరల్ సెక్రటరీ మట్టా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యంగా వరంగల్ తూర్పులో జర్నలిస్టుల సమస్యలు అంతా ఇంతా కాదని, వారి సమస్యల్లో అతి ముఖ్యమైంది అంతా సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ల పై దృష్టి సారించాలని కోరగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సానుకూలంగా స్పందించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



అక్షర దర్బార్
voice of the people

# అకాలం.. అతలాకుతలం..

- ఈదురు గాలులతో వర్షం...!
- గ్రామాల్లో విరిగిపడిన చెట్లు...
- లేచిపోయిన ఇళ్ల పైకప్పు, రేకులు
- నేల వాలిన వరి పంటలు
- తడిసి ముద్దయిన మొక్కజొన్నలు....
- ఆందోళనలో అన్నదాతలు....


ఇంటి పైకప్పు లేచిపోయిన ఇంటిముందు బాదావత్ కిషన్ విజయ దంపతులు


చెన్నారావుపేట నెంబర్ వన్ కాలనీలో ఇంటిపై విరిగిపడిన చెట్టు


నెక్కొండ ప్రధాన రహదారిలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు


చెన్నారావుపేట గ్రామ శివారులో నేల వాలిన వరి పంట

అక్షర దర్బార్, నర్సంపేట: ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం డివిజన్ వ్యాప్తంగా అన్ని మండలాలను పలు గ్రామాల్లో అన్నదాతలను అతలాకుతలం చేసింది. మంగళవారం అర్ధరాత్రి ఈదురు గాలులు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో గ్రామాలలో ఈదురు గాలుల బీభత్సానికి చెట్లు, చెట్ల కొమ్మ లు విరిగిపడ్డాయి. నెక్కొండ నుండి నర్సంపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్ల పక్కన ఉన్న చెట్ల కొమ్మ లు రోడ్లకు అడ్డంగా విరిగిపడడంతో వాహనదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ధర్మ తండ గ్రామంలో బాదావత్ కిషన్ –విజయ దంపతులు రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా అకస్మా త్తుగా వచ్చిన గాలి దుమారంతో ఇంటి పై కప్పు రేకులు ఫ్యాన్లతో సహా లేచిపోయి పక్కనపడ్డాయి. దీంతో పక్కా ఇంటివారికి వెళ్లి తలదాచుకున్నారు. చెన్నారావుపేట నెంబర్ వన్ కాలనీలో మహమ్మ ద్ సుల్తానా కు చెందిన రేకుల ఇంటిపై చెట్టు ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. అలాగే చెన్నారావుపేట భారత్ పెట్రోల్ పంపు పక్కన దాసరి వెంకటేష్ కు చెందిన వెల్డింగ్ షాప్ కు సంబంధించిన రేకులు లేచిపోయాయి. అంతేకాక విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం తెల్లవారుజామున వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెన్నారావుపేట, అక్కల్ చెడ, పాపయ్యపేట, అమీనాబాద్, తిమ్మ రాయిని పహాడ్, జల్లి, కోనాపురం, ఉప్పరపల్లి, లింగాపురం, భోజేరువు, ఎల్లాయగూడెం, లింగగిరి తదితర గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న వరి పంటలు నేలవాలాయి. అంతేకాక గ్రామాలలో రైతులు ఆరబెట్టుకున్న మొక్కజొన్నలు వర్షంతో తమ కళ్లెదుటే అకాల వర్షానికి తడిసిపోవడంతో రైతులు తమ కంట కన్నీరు కారుస్తున్నారు. అంతేకాక వేల రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తే అకాల వర్షం నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా అక్కల్ చెడ గ్రామంలో 4, చెన్నారావుపేటలో 1, సూర్యాపేట తండా గ్రామంలో 1, అమీనాబాద్ లో 1, పాపయ్య పేటలో 1 మొత్తం ఎనిమిది ఇండ్లు కూలిపోయినట్లు గిర్దావర్లు మహమ్మ ద్ రషీద్, మమతలు తెలిపారు. అలాగే చెన్నారావుపేట మండలంలో 46.8 మిమీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.



## దామెర మండలంలో బ్యాంకు ఏర్పాటు చేయాలి

### జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన బీజేపీ

అక్షర దర్బార్, పరకాల : దామెర మండల కేంద్రంలో బ్యాంకు సేవలను ఏర్పాటు చేయాలని బిజెపి దామెర మండల అధ్యక్షుడు వెల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పెసరు విజయచందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, దామెర మాజీ సర్పంచ్ శ్రీరామ్ రెడ్డి, బత్తుల సుమంత్ లతో కలిసి హనుమకొండ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా దామెర మండల కేంద్రంగా కొనసాగుతున్న ఇప్పటికీ బ్యాంకింగ్ సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ నక్సలైట్ బెదిరింపుల కారణంగా వరంగల్ పట్టణానికి తరలించబడిందని అని గుర్తు చేశారు. బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేకపోవడం గ్రామీణాభివృద్ధిని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ప్రజల ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణమే దామెరలో బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యుత్ ఘాతంతో గేదె మృతి

అక్షర దర్బార్, చిట్యాల : విద్యుత్ ఘాతంతో 50 వేల రూపాయల విలువైన పాలిచ్చే బర్రె మృతి చెందిన సంఘటన చిట్యాల మండలంలోని అందుకు తండా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని బండమీది రమేష్ కు చెందిన బర్రె ఉదయం మేతకు విడిచిపెట్టిన క్రమంలో గ్రామ సమీపంలో ఉన్న విద్యుత్తు స్తంభం ప్రకటనే ఉన్న ఎర్త్ లైన్ కు తాకడంతో విద్యుత్తు షాక్కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్తు అధికారులు ఎర్త్ కు సరైన కంచ వేయకపోవడం మూలంగానే బర్రె మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు బాధితున్ని ఆదుకోవాలని వారు కోరారు కాగా విషయం తెలుసుకున్న ట్రాన్స్కో ఏ యి సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు.

## స్వరూప కుటుంబానికి అండగా ఉంటాం

### జిల్లా వైద్యాధికారి డా.అల్లెం అప్పయ్య

అక్షర దర్బార్, భీమదేవరపల్లి: ముల్కనూర్ ఆరోగ్య కేంద్రం కొత్తకొండ సబ్ సెంటర్ చంటయపల్లి గ్రామ ఆశ కార్యకర్త అందె స్వరూప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా జిల్లా వైద్యాధికారి డా. అల్లెం అప్పయ్య నాయకత్వంలో హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులందరూ ముందుకు వచ్చి ఒక లక్ష పది వేల రూపాయలు, సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ ఫాతిమా నగర్ డైరెక్టర్ బాల స్వామి రెడ్డి ఇరవై వేల రూపాయలు, మొత్తం జిల్లా ఆశ కార్యకర్తలు నలబై రెండు వేల ఐదు వందల రూపాయలు జమ చేసి బుధవారం నాడు ఆశ కార్యకర్త స్వరూప కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా అల్లెం అప్పయ్య , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా.అహ్మ ద్, డా.మంజుల, డెమో అశోక్ రెడ్డి, స్థానిక పల్లె దవాఖాన వైద్యులు డా.మౌనిక, డా.నివేదిత, సూపర్వైజర్ రాజయ్య, స్థానిక సబ్ సెంటర్ సిస్టర్స్ అనిత కుమారి, సత్యవేద, గీత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వడగండ్ల అపార నష్టం

### నేలకొరిగిన పంటలు..

### గాలికి లేచిన ఇంటి పై కప్పులు..

అక్షర దర్బార్, పరకాల : మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వానతో పరకాల నియోజకవర్గంలోని పరకాల మండలంలో పైడిపల్లి, నాగారం, వెంకటాపూర్ గ్రామాలలో తీవ్ర పంట ఆస్తి నష్టం ఏర్పడింది. ఆరుగాలం కష్టపడిన రైతులు పంట చేతికొచ్చే సమయంలో వరి, మొక్కజొన్న గాలికి ఒరిగి వరి ధాన్యం రాలిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మిర్చి రైతులు మిర్చి పంటని ఏరి కళ్ళల్లో ఆరబోసుకుంటే అకాల వడగండ్ల వానతో కళ్ళల్లో ఉన్న మిర్చి పంట పూర్తిగా తడసి ముద్దయిందని రైతులు పేర్కొంటున్నారు. లక్షల పెట్టుబడి పెట్టి మిర్చి పంటను పండించిన రైతులు దానిని ఏరేందుకు ఒక్కొక్క కూలికి 300 నుండి 500 వరకు కూలి చెల్లించి కళ్ళల్లో ఆరపోసుకుంటే వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

### గాలికి లేసిన ఇండ్ల పై కప్పులు..

నడికూడ మండలంలోని నడికూడ మండల కేంద్రం తోపాటు పలు గ్రామాలలో 10 ఇండ్ల పైకప్పులు



గాలికి లేచినట్లు మండల తాహసీల్దార్ నాగరాజు తెలిపారు. పరకాల మండలంలో పరకాల పట్టణం తోపాటు నాగారం, లక్ష్మీపురం గ్రామంలో ఇండ్ల పైకప్పులు లేచినట్లు అధికారులు పేర్కొన్నారు.

### పంటల నష్టం..

పరకాల మండలం వెంకటాపూర్, నాగారం, పైడిపల్లి గ్రామాలలో 70 ఎకరాల మక్కజొన్న, 130 ఎకరాల వరి, కొద్దిగా అరటి తోట దెబ్బతిన్నట్లు పరకాల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. నడికూడ మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ మాట్లాడుతూ నడికూడ మండలంలో పది ఎకరాల మొక్కజొన్న, రెండు మూడు ఎకరాల వరి దెబ్బతిన్నట్లు తెలిపారు.



### రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నక్క చిరంజీవి.**



పరకాల మండలంలోని పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పరకాల పట్టణ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నక్క చిరంజీవి డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కల్లాలలో ఉన్న మొక్కజొన్న వరి తో పాటు పంట పొలాల్లో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఆర్థిక సాయం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## జపాన్ చేరిన సీఎం రేవంత్ బృందం

- 22 వరకు పర్యటన
- 23న తిరిగి హైదరాబాద్‌కు..

అక్షరదర్బార్, హైదరబాద్: ఎనిమిది రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ చేరుకున్నారు. నిన్న రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరిన సీఎం బృందం ఇవ్వాళ మధ్యాహ్నం అక్కడి ఎయిర్‌పోర్టుకు చేరింది. ఈనెల 22 వరకు సీఎం పర్యటన కొనసాగనుంది. ఈ పర్యటనలో భాగంగా టోక్యో, మౌంట్ పూజి, ఒసాక తదితర ప్రాంతాల్లో పర్యటించనున్నారు. జపాన్లోని సాంకేతిక పరిజ్ఞానం, ఏవీ ఆధారిత అభివృద్ధిపై సీఎం టీం అధ్యయనం చేయనుంది. ఈనెల 23న తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు.

# నేనున్నా..

### సమస్యలుంటే సంప్రదించండి

### కార్యకర్తలకు కొండా మురళి భరోసా

అక్షరదర్బార్, వరంగల్: కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. వరంగల్ ఓసిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈసందర్భంగా కొండా మురళీ మాట్లాడుతూ.. ఏ సమస్య ఉన్నా ప్రజలు ఎవరి వద్దకు వెళ్లి పైరవీలు చేయకుండా నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ఎలాంటి ఆపద సమయంలోనైనా కొండా దంపతుల ఇంటి తలుపులు తెరిచే ఉంటాయన్నారు. కంటికి రెప్పలా కాపాడుకొని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు తెలియజేశారు.



## స్మితా సబర్వాల్‌కు షాక్



- కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో పోలీసుల నోటీసులు
- విచారణకు హాజరుపై ఉత్కంఠ

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ సీనియర్ ఐఏఎస్, రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ చిక్కుల్లో పడ్డారు. ఏఐ ఆధారిత గిబ్లీ ఫోటో ఆమెకు కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టింది. గిబ్లీ ఫోటోను ట్విట్టర్ ఎక్స్‌లో రీట్వీట్ చేయగా.. కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో ఫేక్ ప్రచారం చేశారంటూ పోలీసులు నోటీసులు ఇచ్చారు. మార్చి 31న 'హాయ్ హైదరాబాద్' అనే ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేసిన ఒక గిబ్లీ చిత్రాన్ని స్మితా సబర్వాల్ రీట్వీట్ చేశారు. ఆ చిత్రంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లోని 'మష్రూమ్ రాక్' ముందు భారీ సంఖ్యలో బుల్డోజర్లు, వాటి ముందు గిబ్లీ శైలిలో నెమలి, జింక ఉన్నాయి. అయితే వైరల్ చిత్రం నకిలీదని పోలీసులు గుర్తించారు. దీంతో ఈ పోస్ట్‌ను రీట్వీట్ చేసినందుకు స్మితా సబర్వాల్‌కు బీఎన్ఎస్ఎస్ యాక్ట్ సెక్షన్ 179 కింద నోటీసులు జారీ చేసినట్లు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ హబీబుల్లా ఖాన్ తెలిపారు. అయితే ఈ నోటీసులపై ఆమె ఏవిధంగా స్పందిస్తారనేది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది.

# రెండు వారాల్లో అర్హుల జాబితా

- పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక
- అనర్హులకు ఇచ్చి ఇబ్బందులు తెచ్చుకోవద్దు
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




అక్షరదర్బార్, భీమదేవరపల్లి: రెండు వారాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను పూర్తి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. అనర్హులను ఎంపిక చేసి ఇబ్బందులు తెచ్చుకోవద్దన్నారు. గతేడాది సన్న ధాన్యం కొనుగోలు చేసామని, అందుకు సంబంధించి రైతులకు బోనస్ డబ్బులను కూడా చెల్లించామన్నారు. అదేవిధంగా సన్న వడ్లకు బోనస్ ను అందిస్తామన్నారు. సన్న రకం ధాన్యం రైతులు బయట విక్రయించకుండా ఐకెపి కేంద్రాలలో విక్రయించాలన్నారు. ఉగాది పర్వదినం నుండి రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించమన్నారు. గ్రామాలలో నూటికి నూరు శాతం లబ్ధిదారులు సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారుల చేతుల మీదుగా కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, డీఎస్ఓ కొమరయ్య, సివిల్ సప్లైస్ డీఎం మహేందర్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్**

మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణం పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. భీమదేవరపల్లిలో పలువురు లబ్ధిదారులకు చెందిన నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఇండ్ల నిర్మాణం చేపట్టి ఎన్ని రోజులు అవుతుందని, నిర్మాణానికి మెటీరియల్ ఎక్కడినుండి తెచ్చుకుంటున్నారని, ఇప్పటివరకు ఎంత ఖర్చు యిందని, ఎంత విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేపట్టారని గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులను కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# జల్సాల కోసం బైక్ చోరీలు

- నిందితుడి అరెస్టు
- 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం





అక్షరదర్బార్, హన్మకొండ: రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసివున్న దిచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నిందితుడుని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుండి సుమారు రూ. 10 లక్షల విలువ గల 18 ద్విచక్ర వాహనాలతోపాటు ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి కాజీపేట ఏసీపీ తిరుమల్ వివరాలను వెల్లడించారు. ఈ రోజు ఉదయం పోలీసులు హసన్‌పర్తి మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి గమనించి తప్పించుకునేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు. ద్విచక్ర వాహనానికి సంబంధించి ఎలాంటి అధారాలు లేకపోవడంతో పోలీసులు విచారించారు. జనగామ జిల్లా చిలుపూర్ మండలం ఫతేపూర్ గ్రామానికి చెందిన ( ప్రస్తుతం హనుమకొండ గోపాల్‌పుర్‌లో నివాసం) గుగులోత్ చందు లాల్ కొద్ది రోజులుగా తనకు డ్రైవింగ్ లైసెన్స్ లేనందున స్నేహితుడి లాగిన్ ఐడీతో జోమాటో, స్విగ్గీ, ర్యాపిడో సంస్థల్లో పనిచేస్తున్నాడు. వీటి ద్వారా వచ్చే అదాయం జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయిస్తే వచ్చే డబ్బు జల్సాలు చేయాలకున్నాడు. అనుకున్న ప్రకారం హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 7, హసనపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 3, కెయూసి పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడంతో పాటు నిందితుడు రాచకొండ కమిషనరేట్ పరిధిలో 4, భువనగిరిలో 2, హైదరాబాద్‌లో 1 చొప్పున మొత్తం 18 బైక్‌లు చోరీ చేశాడు. అవకాశం చూసుకోని విక్రయించేందుకు భద్రపర్చుకోగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# వడగండ్ల నష్టం

- నేల వాలిన వరి, మిరప, మొక్కజొన్న పంటలు
- కళ్లాల్లో ఆరబోసిన మిర్చి, ధాన్యం వరద పాలు
- బోరుమన్న రంగాపురం, ఇస్సీపేట తదితర గ్రామాల రైతులు



అక్షరదర్బార్, మొగుళ్లపల్లి: ఈ ఏడాది రైతుల పరిస్థితి కడు దయనీయంగా తయారైంది. ఇప్పటికే పంటలకు సాగునీరు అందక, పంట ఉత్పత్తులకు మార్కెట్ లో గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా అకాల వర్షం కురిసింది. మంగళవారం రాత్రి వడగండ్ల వానతో భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి, మిరప, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. మొగుళ్లపల్లి మండలంలోని రంగాపురం, ఇస్సీపేట, మొగుళ్లపల్లి తదితర గ్రామాల్లో కొన్ని గంటలపాటు వడగండ్ల వాన పడటం వల్ల వరి పంటలోని గింజలు, మిరప చేనులోని కాయలు కింద రాలిపోయాయి. కళ్లాల్లో రైతులు ఆరబోసిన మిర్చి, వడ్లు వరదకు కొట్టుకుపోయాయి. బుధవారం ఉదయం రైతులు వరద నీటిలో తేలాడిన మిర్చి, వడ్లను కుప్పగా చేసి ఆరబోశారు. నేల రాలిన పంటలను చూసి సదరు గ్రామాల బాధిత రైతులు బోరుమన్నారు. అకాల వర్షం వల్ల వంట నష్టపోయిన తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నష్టం జరిగిన పంటలను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి పరిహారాన్ని అందజేయాలని వేడుకుంటున్నారు.